# కవితా కౌముది

## మనసు

సబ్బని లక్ష్మీనారాయణ

మనసు మెత్తనిది
మాట అనే చురకత్తితో పరపరా కోసేయచ్చు ఎవరైనా !
ఎవరికి నచ్చుతుంది నీ మనసు, మాట?
నచ్చడాలు అనేది మనిషిని బట్టి ఉంటుంది
మాట నచ్చాలంటే ముందుగా మనిషి నచ్చాలే
ఎక్కడి వాడు మనిషి?
ఏ ప్రాంతం వాడు, ఏ దేశం వాడు, ఏ మతం వాడు,
ఏ కులం వాడు, ఏ రంగు వాడు, ఏ జాతివాడు
అని చూసి పలుకరించే లోకంలో
బహుశా మనిషి ఒంటరి వాడే !
ఎవరో కావాలని విసిరే మాట అనే చుర కత్తి
మనసును తీరని గాయం చేస్తుంది
గాయాలకు మందు నాకు బహుశా కన్నీళ్లు, కవితలే
జలజల కురిసే వానను,
ఆర్తితో కనుకొలుకుల్లోంచి జారే కన్నీళ్లను
ఏ పేరుతో పిలుద్దాం?
ఏ బుద్ధుడో, భర్తృహరో, వేమననో, తుకారామో స్ఫురణకువచ్చి
మనసును నింపుకుంటే
బహుశా బాధ దూది పింజెలా తేలిపోతుందేమో !
పరిమళించే పువ్వే కావాలా?
గడ్డి పువ్వైనా ఒకోసారి శోభిస్తుంది !
మనుషులం ఉట్టి పాత్రదారులం ప్రపంచ నాటక రంగంమీద
మంచి చెడులు సాపేక్షాలు ఐనిస్టీన్ సిద్ధాంతంలా !
ఎవరి గోల వారిదే ఈ ప్రపంచంలో
తెలియక కొందరు తెలిసి కొందరు
నటిస్తూ బతుకుతారు, బతుకుతూ నటిస్తారు
రాయడానికి ఏమీ ఉండవు ఒకోసారి
ఉట్టి ఖాళీ అయినా మనసు తప్ప !
మనసు మెత్తనైతే కన్నీళ్లు, కవితలు
మనసు రాయిలా అయితే బహుశా ఏమీ ఉండవు.





★★★

# భావవీచికలు

మూలా వీరేశ్వరరావు

1) మౌనాన్ని రాజేసి
గానాన్ని పోగేసి
శయ్య పై మల్లెల కల్లని విసిరేసి
దీపానికి శలవిచ్చి
ధూపానికి సెలవిచ్చి
అద్వైతమై అలరించి
మోహపు క్షణికాలు గా
మిగిలిన రాత్రి
హేమంత ధాత్రి !

2) ఎవరి గొడవల్లో వాళ్ళు
ఎవరి గూళ్ళల్లో వాళ్ళు
ఎవరు వాళ్ళు ?
నాతో జీవన రహదారి లో
ప్రయాణించే వాళ్ళు
నా దారి లో రాళ్ళు
పరిచే వాళ్ళు
ఎవరు వాళ్ళు ?
నా వెనుక నవ్వే వాళ్ళు
నా నవ్వులకు ఏడ్చే వాళ్ళు
ఎవరు వాళ్ళు ?
నా వెన్నెలను దోచిన వాళ్ళు
నా ఉదయాన్ని ఉరి తీసిన  వాళ్ళు
ఎవరు వాళ్ళు ?
ప్రశ్న లంటే ఉలిక్కి పడే వాళ్ళు
కాలం ఉలి తో జీవన శిల్పాన్ని  చెక్క లేని
వాళ్ళు
చరిత్ర పొరల్లో  శిథిలమైన వాళ్ళు
శిథిల గుళ్ళకు పూజారులయిన వాళ్ళు
బానిసత్వ పౌరోహిత్యాన్ని స్వీకరించిన వాళ్ళు
ఎవరు వాళ్ళు ?
నిర్మాణం పూర్తి కాని పునాది రాళ్ళు
అనాది గా పూడని పగుళ్ళ దిగుళ్ళు !

3) గులాబీ ని చూస్తే గుబులు
ఎక్కడ సుగంధ బంధాలు
వీడి పోతాయేమో న ని !
చిన్ని పాదాలు చూస్తే చింత
పెద్దవై ఎక్కడ జనారణ్యం లో ఇరుక్కు
పోతాయని !
చెట్టు ని చూస్తే దిగులు
ఎక్కడ శిశిర మై
దూరమై పోతుందని !
జీవితాన్ని వీక్షిస్తే ఆశ్చర్యం !
క్షణిక మైనా ఇంకా
మోహమెందుకు పెరుగు తోందని !

4)నీకు గొడుగు ఇచ్చి
తను వర్షం లో అడుగు
లు వేసాడు
నీవు తూనీగ ల తో
ఆడుతుంటే
నీ స్కూలు బ్యాగ్ లు
మోసాడు
నీవు రైలు లో ఉన్నత శ్రే ణి లో ప్రయాణం చేస్తే
తను సాధారణ తరగతి కి
పరిమిత మయ్యాడు
తన ధనం నీ జీవితాని కి
ఇంధనమయింది !
తన తనువు నీ జీవన సమరానికి
ధనువయింది
ప్రేమ లో అక్షరాలు రెండు
నాన్న ప్రేమ లో లక్షణాలు మెండు !

****

## మా "ఆయి"
### నాగ్రాజ్

ముఖం మీద ముడతలెన్నో
ఆవిడ జీవన గమనంలో
అనుభవాలన్ని

శారీరబాధలకి ఏనాడు
దవాఖాన గడప తట్టలేదు
ఆవిడొక ఆయుర్వేద
గ్రంథాలయం

కడగండ్ల కుంగుబాటు
సుఖాల పొంగుబాటు
ఒకేరీతిన జీర్ణించుకున్న
మానసిక శాస్త్రవేత్త

వేదాలు వర్ణించని
ఉపనిషత్తులుపదేశించని
అంతర్జాలానికి అంతుచిక్కని
ఒకతరం జీవనసారం

★★★

## ఎన్నెన్నో..!
### కె.రాధికానరేన్

మౌనం మాట్లాడితే
లిపి లేని మాటలెన్నో,
కాలం కాసేపు ఆగితే
కనపడని కలతలలెన్నో
గతానికి గడువు నిస్తే
మరపురాని గుర్తులెన్నో
కమ్మని కల వస్తే
నిద్రించిన రాత్రులెన్నో
బాధ లను మరవనిస్తే,
కన్నీటి వీడ్కోలు ఎన్నో
ఆనందాలు గుర్తొస్తే
వికసించే నవ్వు లెన్నో
నిన్న టినీ వదిలేస్తే
రేపటి రోజులెన్నో
మలచి కానుకలుగా వచ్చేస్తే
మిగిలిపోయే మధురిమలెన్నో……..!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

పర్వతమ్ములు చలితోడ వణకిపోవ
వేనితో కప్పి యిత్తుము వెచ్చదనము?
గడ్డ కట్టించు దినములు గడచు వరకు
వేచియుండుట గాకేమి వేరుదారి?

ధనము రాసులై యింట నిల్చినను గాని
ప్రకృతి దయమాలి వర్షమ్ము బ్రాతియైన
ఎదురు చూడక చినుకుకైనేమి దారి?
ఎవరు బ్రతికెదరంబరాంబువులు లేక?

ఎంత నేర్చిచి మరియెంత యెత్తుకెదిగి
సంపదలనశేషముగనార్జింప గలిగి
కాలమెల్లను హాయిగా గడచుచున్న
ఎపుడొ తెలియు నాచేత లేదేమియంచు

ఏవొ కడగండ్లు తాకి బాధించునపుడు
బయట పడవలెనన్నచో వలను కాక
నిస్సహాయతతో మది నిండిపోవ
స్పష్టమౌనపుడు మన యల్పత్వమెంతొ

మనలకర్థముకాని సమస్యలెన్నొ
ఏవిధమ్ముగ తీరని యిడుమలెన్నొ
ఎవ్వరెటులనో వచ్చి రక్షించువరకు
ఎదురు చూచుట కాకనింకేమి దారి?



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS